# విసుగు

- ఎ.వి.రెడ్డిశాస్త్రి

విసుగు, విసుగు, ఒకటే విసుగు. ఎందుకా? ఎందుకంటే ఏమ చెప్పాలి? ఎన్నాళ్లయింది ఈ భూమ్మీద వాన చినుకుపడి! మూడు సంవత్సరాలు కాదే-ముప్ఫయి సంవత్సరాలపైనే అయింది- వాన అన్నమాట లేదు. వాన, చలి అన్న మాటల్ని కూడా మరిచిపోయారు ప్రజలు. ఇప్పుడు వాళ్లకి గుర్తున్నదల్లా ఒకటే ఒకటి-ఎండ, ఎండ, ఎండ! నిత్యం నిప్పులు కురుపిస్తున్న ఎండ! ఈ ఎండ వేడిమికి తట్టుకోలేక భూమి లుంగలు చుట్టుకుపోతుంది. నీరన్నది ఎక్కడా లేకపోవడంతో- మనుషులంతా నల్లబడిపోయి, గిడసబారినాయి. రాతితో తయారైన నిర్జీవ ప్రతిమల్లా తయారయిపోయారు. తాగడానికి నీరులేకపోతే మనుషులంతా చస్తారనికదా అంతా నమ్మేది-అబ్బే-అలాంటిదేం జరగలేదు. ఈ నీరులేని స్థితికి మనిషి క్రమేణ అలవాటుపడిపోయాడు. కాలం గడుస్తున్నకొద్దీ 'వాన' అన్నది ఒకటుండేదని, 'నీరు' అన్నది మనిషికి చాలా అవసరంగా భావించే వారనిగాని ఎవ్వరికీ గుర్తులేకుండాపోయింది. సంవత్సరాల తరబడి క్రమం తప్పకుండా ప్రతి రోజు తెల్లవారిన దగ్గ ర్నుంచి అగ్నిని కురిపిస్తూ సూర్యుడు వుదయిస్తాడు. ఇంతటి ప్రచండమైన ఎండనీ భరించడానికి అలవాటు పడిపోయారు ప్రజలు. ఎక్కడా చెరువు ల్లేవు, దారవుల్లేవు నదుల్లేవు, సముద్రాల్లేవు. ఉన్నదల్లా సగం కాలి ఆరిపోయిన కట్టెలా తయారయిన భూమి, మనుషులు.

విసిగిపోతున్నారు జనం-దారుణమైన ఎండల వల్లకాదు ఆ విసుగు! మార్పన్నది లేకుండా-నిత్యం యీ ఎండలేనా? అదేవాళ్ల విసుగుకు కారణం-మార్పులేని కాలగతి వల్ల సంభవించిన విసుగది.

ఇలా వుంటూ వుండగా ఓనాడు ఆకాశంలో నల్లని పొఘలు మహా చిక్కగా కనిపించడం మొదలైంది. ఎండ ఎక్కడా కనపడకుండాపోయింది. ఆ వింతని చూసి మనుషులంతా భయభ్రాంతులైపోయారు. ఏమిటి చెప్మా యివన్నీ యిలా ఆకాశంలోకి వచ్చిపడిపోతున్నాయీ అని ఆకాశం వైపు అలా చూస్తూ వుండిపోయారు. ఇంతలో వురుషులు, మెరుపులు, పిడుగులు ఆర్భాటంతో వాన ప్రారంభమైంది. వానంటే-అలాంటి లాంటి వాన కాదు. ఆకాశం చిల్లుపడిపోయి, ఆపైన ఎక్కడో దాక్కుని వున్న మహాసముద్రాలు ఆ కంతల్లోంచి జారి కిందికి ప్రవహించేస్తున్నట్లుగా కురిస్తోంది వాన. మనుషులు చెప్పడానికి వీల్లేనంతగా భయపడిపోయి, యిళ్ళల్లోకి, గుడిసెల్లోకి పరుగులు తీసి తలుపులు, గడీలు పెట్టేసుకున్నారు- ఏమైపోతామోననే భయంతో కాలం గడుస్తోందికాని-వాన మాత్రం ఎంతకీ ఆగడం లేదు. కొద్దిగా జడుపు తగ్గేక జనాలు కాస్త అరుగుల మీదికి వచ్చి సంతత ధారగా కురుస్తున్న వానవైపు కాస్త ధైర్యంగా చూడ్డం మొదలెట్టారు. అలా చూస్తూ వుంటే వాళ్లకి చాలా సరదాగా అనిపించింది. ఎండలు పడిపడి వున్న ప్రాంతాలకి యీ వానలు, చల్లని వాతావరణం- ఆహ్లాదకరమైన మార్పులా అనిపించేయి. అయితే ఆ సరదా అట్టే కాలం నిలవలేదు. వానలు అలా ఎడతెగకుండా, కుంభవృష్టిగా అలా రోజులు, నెలలు దాటి సంవత్సరాలు కురుస్తున్నాయేమో-దాంతో జనాలకు విసుగు పుట్టడం మొదలైంది. ఏవిటి ఈ దిక్కుమాలిన వానని, ఒక్క నాల్రోజులు తెరిపిచ్చి ఎర్రగా ఎండ వస్తే ఎంత బాగుంటుందో! ఎవరూ ఎక్కడికీ కదల్డానికైనా వీల్లేకుండా ఇళ్లల్లో కట్టిపడేస్తుందీ వాన. ఎక్కడ చూసినా జలప్రవాహాలే!! ఇళ్ళల్లోనీ, గుళ్ళల్లోనీ అలా విసిగిపోయి కూర్చున్నారు జనం. ఆ వాన చూస్తుంటే ఇప్పుడు అంతులేని విసుగు,విసుగు, విసుగు కలుగుతోంది.

ఏళ్ల తరబడి కురిసిందా వాన. అలా కురిసి కురిసి ఓనాడు హఠాత్తుగా ఆగిపోయింది. పారిపోతున్న మేఘాల మాటు నుండి దొంగలా సూర్యుడు యీలోకంలోకి ప్రవేశించాడు. ఈ మార్పుని సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ కూర్చున్నారు జనాలు. నీళ్ళన్నీ ఎక్కడివో, ఎక్కడివో జరజరా ప్రవహిస్తూ



వెళ్లిపోతున్నాయి. సూర్యుడు మళ్ళీ పెను రాక్షసుడ్లా విజృంభించి లోకం మీద విరుచుకు పడ్డాడు. క్రమేపి అంతటా నీరు ఇంకిపోయి నేల కనపడ్డంతో బిలబిలమంటూ జనాలల్లో యిళ్ళల్లోంచి బయటికి వచ్చేసి సంతోషంతోనే వింతలు పెట్టారు.

మళ్ళీ ఎండ-ఎండ-ఎక్కడెక్కడ వున్న నీటినీ ఆవిరిగా మార్చేస్తున్న పెనుకుండెలాంటి ఎండ క్రమేపీ మళ్ళీ అందరికీ విసుగు కలగడం మొదలైంది. ఏమిటీ దరిద్రపుగొట్టు ఎండ- ఇలా తినేస్తుంది ప్రాణాల్ని కొరికేసి! ఆ వానే వాళ్ళం వెచ్చదనం కోసం కావలించుకొని పడుక్కోవడాలతో జనాభా పెరిగిందని! మళ్లీ ఈ దిక్కుమాలిన ఎండ తయారైపోయింది.

ఎండని తిట్టడం అలా కొనసాగుతూనే వుంది. కాని ఈ లోగా జనాలు కనుక్కోలేనంత తాపీగా ఏదో మార్పు మెల్లిమెల్లిగా వచ్చేస్తోంది. ఎండ తీక్షణత, తగ్గుముఖం పట్టింది. మిట్ట మధ్యాహ్నం వేళప్పుడు కూడా సూర్యుడు ఆరిపోయిన మంటలా కనిపిస్తున్నాడు కాని- ఇంతకు మునుపు అలాంటి అగ్నిగోళంలా అనిపించడం లేదు. ఏమిటి చెప్మా ఈ వింత అని జనం మళ్లీ విస్తుపోతున్నారు. అలా చూస్తుండగానే చలి వచ్చి పాడిపోయింది. కొండల్ని కూడా బద్దలు చేస్తున్నట్లనిపించిన మందుటెండల తరువాత వచ్చిన ఈ చలి చాలా చాలా బాగున్నట్టుగా అనిపించింది. అయితే ఈ సంతోషం అట్టే కాలం నిలువలేదు. క్రమేపి చలి మహమ్మారిలా విజృంభించింది. గడగడ వణికించడంతో సరిపెట్టుకోకుండా ధారాపాతంగా మంచుని కురిపిస్తూ ఎవ్వరూ బయటకు రావడానికి వీల్లేకుండా చేసిపారేస్తోంది. వెండు దుప్పటి కప్పినట్టు లోకం అల్లా తెల్లని మంచుతో నిండిపోయింది. బయటకు రాకుండా ఎంతకాలవని యిళ్లల్లోనే వుండిపోగలరు జనాలు? కాని బయటకు రావడానికి వీల్లేకుండా చలీ, మంచు చంపిపారేస్తున్నాయో! మహావ్యాపకం లేకుండా యిళ్లల్లోనే మనుషులంతా వుండిపోవడంతో మళ్లీ తామరతంపరగా జనాభా పెరిగిపోతోంది. మనుషులకి క్రమేపి ఎండా, నీరు, తిండి-నీటి అవసరం లేకుండా పోయింది. కేవలం గాలి పీల్చి జీవించే స్థితిలోకి వచ్చేరు. అంచేత-యిళ్లల్లో పెరిగిపోతున్న అధిక జనాభా వాళ్లనేమీ యిబ్బంది పెట్టడం లేదు.

ఏది ఏమయినా ఎక్కడికే కదల్డానికి వీల్లేని స్థితి వచ్చిపడేదేనని జనం చాలా చికాకుపడిపోతున్నారు. పెళ్ళాం బిడ్డల్ని కావలించుకుని ఎన్నాళ్లని, ఎన్నాళ్లని యిలా యిళ్ళల్లో, యీ చలికి వణికిపోతూ-ఎంత కాలం రాజ్యం చేసిందో ఎవరికీ తెలియలేదు. సంతతులు అంతరించిపోతున్నాయి. -కొత్త సంతతులు వస్తున్నాయి-అయినా చలి పోవడం లేదు. అయితే-ఎప్పుడో, ఎలా పోయిందో తెలీదుకాని- చలిపోయింది.

మళ్లీ ఎండలు వచ్చి-జనాల్ని కాల్చిపారేశాయి. జనం చికాకుపడిపోతున్నారు.

ఎండలు పోయాయి-వానలు వచ్చేయి. అంతులేకుండా కురుస్తున్న వానల్ని చూసి-మహా చికాకుపడిపోతున్నారు జనం.

వానలు వెలిసిపోయి-చలి వచ్చింది. విసుగు, బయటక్కదల్నివ్వకుండా చేస్తున్న చలి చూసి చికాకుపడిపోతున్నారు జనం.

కొండలు, నదులు, చెట్లు, చేమలు, ఓనాడు సమావేశం పెట్టుకొని గొల్లున నవ్వుకోవడం మొదలెట్టేశాయి. కొన్ని లక్షల కోట్ల సంవత్సరాల వయస్సున్న ఓ ముసలి కొండ-ప్రకృతికంతటికీ వినిపించేలా గొంతుక సవరించుకొని తన కరకర స్వరంతో యిలా అంది. 'చూస్తున్నారు కదా యీ మనిషిగాడ్ని! వీడు యీ భూమ్మీద బతికే ఆరు పదుళ, ఏడు పదుళ బతికే బతుక్కి-వీడు పడుతున్న చికాకుని, విసుగునీ గమనిస్తున్నారా? వీడికి ఎండను చూస్తే చికాకు, చలిని చూస్తే చికాకు, వానను చూస్తే చికాకు, ప్రకృతిని చూస్తే చికాకు-ఆఖరికి తన చుట్టూ వున్న తన జాతి మనుషుల్ని చూసినా చికాకే. ప్రకృతిలో జరిగే మార్పుల్లో ఏదో తిరకాసొచ్చి-యీ మనిషిగాడు భూమ్మీద అవతరించి వుంటాడు. కాని వీడు ఏ క్షణాన అవతరించేడోగాని-ఆ క్షణం నుండే వీడు చెయ్యని విధ్వంస కార్యం లేదు-యీ ప్రకృతిని నాశనం చెయ్యడానికి. యీ ఒక్కడు యి భూమ్మీద లేకుండాపోతే- మళ్ళీ మనమంతా ఏ బెడదా లేకుండా, ఎన్ని కోట్ల సంవత్సరాల వరకో ప్రశాంతంగా, హాయిగా వుండడానికి వీలవుతుంది-అవునంటారా?" అంది.

సమస్త ప్రకృతీ ఆ మాటని అంగీకరిస్తూ వత్తాసు పలికింది. ●